

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

15

**సాంబశివరావు** నీరజ అందించిన కాఫీ కప్పు అందుకున్నాడు.

"రాజేష్‌ని అనాథ శరణాలయంలో చేర్పించే ఏర్పాటు చేస్తున్నాను" చెప్పాడు పొడిగా.

నీరజ మాట్లాడలేదు.

"అందుకు డాక్టర్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తీసుకోవాలి. నువ్వు తీసుకెళతావా? నన్ను తీసుకెళ్ళమంటావా? నువ్వే తీసుకెళితే మంచిదనిపిస్తోంది. సివిల్ సర్జన్ అయివుండాలి ఆ డాక్టర్."

"మనం తీసుకెళదాం" చెప్పింది నీరజ.

సాంబశివరావు ఆ సమాధానం ఎదురు చూడకపోవడంతో కొద్దిగా ఆశ్చర్యపడ్డాడు.

"రాజేష్‌ని తయారుచేస్తాను. బయలుదేరదాం" చెప్పింది.

అరగంట తర్వాత స్కూటర్ ఎలియన్ సీటులో నీరజ, ముందు సాంబశివరావు, అతని ముందు చిన్ని చేతులతో హేండిల్ బార్ పట్టుకుని నిలబడ్డ రాజేష్‌లని చూసింది వీధి గుమ్మంలో నిలబడ్డ సాహితి. రాజేష్ ఆమెని చూసి చేయి వూపాడు టాటా చెపుతున్నట్టుగా. వెంటనే ఆమె మనసునిండా ఎన్నో ప్రశ్నార్థాకాలు.

స్కూటర్ ఓ ప్రయివేట్ క్లినిక్ ముందు ఆగింది. ముగ్గురూ లోపలికి వెళ్ళారు. అట్టే రద్దీగా లేకపోవటంవల్ల ఆ చిల్డ్రన్ స్పెషలిస్ట్ రాజేష్‌ని వెంటనే చూశాడు. అతని టేబుల్ మీద గాజు సీసాలోంచి చాక్లెట్‌లు కనిపిస్తున్నాయి.

"నిద్రలో ఉదయం కూడా లాగూ తడి చేస్తున్నాడండి" చెప్పింది నీరజ.

"బాత్ రూం దాకా వెళ్ళడం బద్దకమా?" నవ్వుతూ అడిగాడు డాక్టర్ హసన్.

రాజేష్ సిగ్గుతో జవాబు చెప్పలేదు వెంటనే.

"మేమూ అదే ప్రశ్న అడిగితే అసలు తనకు తెలియదంటున్నాడు. యూరిన్ పాస్ అయే సెన్సేషన్ లేదు"

డాక్టర్ హసన్ రాజేష్‌ని అడిగాడు.

"నీకు తెలియకుండానే పోతోందా?"

తలుపాడు.

"ఎప్పటినుంచి?"

ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేదు రాజేష్. ప్రశ్నార్ధకంగా చూశాడు డాక్టర్. నీరజ, సాంబశివరావుల వంక. వాళ్ళకి సమాధానం తెలియదు కాబట్టి నీరజే అడిగింది రాజేష్‌ని.

"విజయవాడలో మీ అమ్మ కోప్పడేది కాదూ ఇలా అవుతుంటే"

తలవూపాడు.

"మీ అమ్మ డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళిందా నిన్ను?" అడిగాడు డాక్టర్ హసన్.

"లేదండి. ఎప్పుడూ తీసుకు వెళ్ళలేదు."

రాజేష్‌ని ఎగ్జామినేషన్ టేబుల్ మీద పడుకోబెట్టి పరీక్ష చేశాడు. తర్వాత చెప్పాడు.

"ఒకటి రెండు పరీక్షలు చేయాలి."

పేడ్‌లో ఏదో రాసి, కాగితం చింపి సాంబశివరావుకి అందించి చెప్పాడు.

"విద్యానగర్‌లో వుంది పేథలాజికల్ లేబరేటరీ. ఇప్పుడు వెళితే వుంటారు. ఈ పరీక్షలు చేయించండి."

"ఇది అవసరమా? ఏదయినా మందిస్తే తగ్గదా?" సందిగ్ధంగా అడిగాడు సాంబశివరావు.

"మందెలాగూ యిస్తాను. టు బి ఆన్ సేఫ్ సైడ్ ఇవి చేయించండి."

డాక్టర్ మరిగే వేడినీళ్ళలోంచి ఇంజక్షన్ సిరంజి, నీడిల్‌ని పట్టకారుతో తీసి వాటిని అమర్చాడు. ఓ చిన్న సీసాలోంచి మందుని ఇంజక్షన్ సిరంజిలోకి ఎక్కించాడు.

"ఇంజక్షనా?" భయంగా అడిగాడు రాజేష్.

"అవును."

"వద్దు"

"ఏం కాదు. తీసుకో" నీరజ రాజేష్ తలమీద చెయ్యివేసి ధైర్యం చెప్పింది.

"వద్దు. నేనింతదాకా ఎప్పుడూ ఇంజక్షన్ తీసుకోలేదు" రాజేష్ కంఠంలో ఏడిచే సూచనలు వినిపించాయి.

"నిన్నెప్పుడయినా దోమ కుట్టిందా?" అడిగాడు డాక్టర్ హసన్ నవ్వుతూ. రాజేష్ చేతిమీద స్పిరిట్‌లో ముంచిన దూది రాశాడు.

"కుట్టింది"

"అంతేమరి ఇది కూడా."

"అయినా వద్దు"

"ఏం కాదు. అసలు నొప్పే వుండదు" చెప్పింది నీరజ.

"చాక్లెట్లు నీక్కావలసినన్ని తీసుకో" చెప్పాడు డాక్టర్ వాటివంక చూపిస్తూ.

రాజేష్‌కి ఇక ఇంజక్షన్ తప్పదని తెలిశాక కుర్చీ ఎక్కి, నిలబడి నీరజ చెవిలో చెప్పాడు.

"ఇవాళ మీరూ, నాన్నగారూ కలిసి సినిమాకెళితేనే ఇంజక్షన్ చేయించుకుంటాను."

"సినిమాకా?" ఆశ్చర్యంగా అడిగింది నీరజ.

తలూపాడు నవ్వుతూ.

"ఎందుకు?"

మళ్ళీ చెవిలో చెప్పాడు.

"నేనొచ్చేగా మీ ఇద్దరికీ పోట్లాట పెట్టింది. విజయవాడలో మా ఎదురింట్లో అంకుల్, ఆంటీ సినిమాకి వెళ్ళినట్లుగా వెళ్ళేవారే కాని నా మూలానా మానేశారుగా. అందుకని."

నీరజ ఆప్యాయంగా రాజేష్ తల నిమిరింది.

"తప్పకుండా" చెప్పింది.

"ప్రామిస్" చెయ్యి చాపాడు.

"ప్రామిస్" ఆ చేతిలో చెయ్యి వేసింది నీరజ.

రాజేష్ ఆ చేతిని డాక్టర్ ముందుకు చాపాడు. వెంటనే బలంగా కనురెప్పలు బిగపట్టి కళ్ళు మూసుకున్నాడు.

"మనని కుట్టే దోమ నోట్లో నలభై ఏడు పళ్ళుంటాయి. మరి యిది ఒక్కటేగా. దోమ కుట్టినట్లుగా కూడా వుండదు."

"అమ్మా" అరిచాడు. రాజేష్ సూది మొన తన లేత చర్మంలోకి దిగగానే. ఆ కేకకి నీరజ హృదయం కలుక్కుమంది. భర్తవంక చూసింది సాంబశివరావు బయటికి చూస్తున్నాడు. క్షణాల్లో ఇంజక్షన్ యివ్వడం అయిపోయింది.

"రేపు సాయంత్రం రిజల్ట్స్‌తో రండి."

"థాంక్స్ డాక్టర్"

సాంబశివరావు ఫీజు చెల్లించి బయటపడ్డాడు. స్కూటర్ స్టార్ట్ చేస్తూ అడిగాడు.

"ఆ చెకప్ చేయించి తీరాలా? డాక్టర్స్‌కి లేబరేటరీనించి కొంత కమీషన్ వస్తుంటుంది. అందుకని అవసరం లేకపోయినా చెకప్‌కి పంపుతూంటారు."

నీరజ చిన్నగా నవ్వి గొంతు తగ్గించి చెప్పింది.

"డాక్టర్ మాట, లాయర్ మాట నమ్మడం మంచిది. లేదా మీ కొడుకు కాదని నిరూపించడానికి రాజేష్ అనారోగ్యం విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం.

"పేథలాజికల్ లేబ్‌కి వెళ్ళారు. హసన్ రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ చదివి చెప్పాడు టెక్నీషియన్.

"బ్లడ్ తీసుకోవాలి"

"ఇంజక్షన్ సిరంజిలోకా?" అడిగింది నీరజ.

"అవును"

ఇందాకటి రాజేష్ కేక ఇంకా చెవుల్లో గింగురుమంటోంది.

"కానీండి"

"మళ్ళీ ఇంజక్షనా?" భయంగా అడిగాడు రాజేష్.

ఎడం చేతిని పరీక్షించి రక్తనాళంలోకి సూదిని గుచ్చి రక్తం తీసుకున్నాడు టెక్నీషియన్. రాజేష్ సూది గుచ్చుకోగానే ఈసారి అరవలేదు. మనసులోనే 'శ్రీరామ, శ్రీరామ శ్రీరామ' అనుకున్నాడు.

ఎక్స్‌రే తీశాక సాంబశివరావు ఫీజు చెల్లించాడు. మర్నాడు సాయంత్రం యూనివర్శిటీ నుంచి వస్తూ నీరజ కలెక్ట్ చేసుకుంటుంది వాటిని.

ముగ్గురూ కొద్ది దూరంలో వున్న శంకర్ మఠంలోని దేవాలయంలోకి వెళ్ళారు. కొబ్బరికాయ కొట్టి బయటికి వచ్చారు.

సాంబశివరావు స్కూటర్ స్టార్ట్ చేసి ఫస్ట్ గేర్‌లో వేస్తుండగా రాజేష్ మెరుపులా స్కూటర్ మీంచి కిందికి దూకి శంకరమఠం బస్‌స్టాప్‌లో రద్దీగా నిలబడ్డ మనుషులవైపు ఎక్కుపెట్టి వదిలిన బాణంలా పరిగెత్తాడు.

నీరజ, సాంబశివరావు అతని అరుపులు స్పష్టంగా విన్నారు.

"అమ్మా..అమ్మా.."

నీరజ, సాంబశివరావుల చూపులు రాజేష్ మీదనుంచి బస్‌స్టాప్‌లో నిలబడ్డ మనుషులమీదకి వెంటనే మళ్ళాయి. అప్పుడే ఓ బస్సు బయలుదేరి వెళ్ళిపోయింది.

రాజేష్ జనాన్ని తోసుకుంటూ వెళ్ళి వెనకాల ఆగిన బస్ ఎక్కుతున్న ఎర్రచీర కట్టుకున్న ఓ అమ్మాయి కొంగు పట్టుకుని లాగి గట్టిగా పిలిచాడు.

"అమ్మా!"

వెనక్కి తిరిగి రాజేష్ వంక చూసింది ఆమె.

"ఏం కావాలి బాబూ?" అడిగింది దాదాపు ముప్పై ఏళ్ళున్న ఆమె.

రాజేష్ ఆమె కొంగుని వదిలేసి "సారీ మేడమ్" అని మిగతావాళ్ళ మొహాలని పరకాయించి చూశాడు. ఆ బస్సు స్టాప్‌లోని ఆడవాళ్ళందరినీ ఎక్కించుకుని వెళ్ళిపోయింది. రాజేష్ ఒక్కడే మిగిలాడు.

వెనక్కి తిరిగి, పొంగివచ్చే దుఃఖాన్ని అనచుకుంటూ స్కూటర్ దగ్గరకి వచ్చాడు.

"మీ అమ్మ కనబడిందా?" అడిగింది నీరజ.

"అవును. దగ్గరకి వెళ్ళిచూస్తే అమ్మకాదు."

"పొరబడి వుంటావు" చెప్పాడు సాంబశివరావు స్కూటర్ స్టార్ట్ చేస్తూ.

"లేదు. నేను చూశాను అమ్మే."

నీరజ, సాంబశివరావు మొహామొహాలు చూసుకున్నారు.

"అమ్మ కావాలనిపించడంతో అలా ఎవరినో చూసి భ్రమపడివుంటాడు" చెప్పింది నీరజ భర్తకి.

ముగ్గురూ ఇంటికి వెళ్ళిపోయారు. రాజేష్ బాగా మూడీగా వుండటం గమనించాడు దశరథరామయ్య. నీరజ బస్‌స్టాప్‌లో జరిగింది చెప్పింది. రాజేష్ ఒక్కడే ఓ మూల కూర్చుని క్రేయాన్స్‌తో తెల్ల కాగితాల మీద బొమ్మలు గీసుకుంటూండిపోయాడు భోజనాలకి పిలిచేదాకా. కంచం ముందు కూడా నిశ్శబ్దంగా వుండిపోయాడు. "ఒక్క ఈ ముద్ద అమ్మది..." అనటం తప్ప.

ఎనిమిదిన్నరకి రాజేష్‌ని అడిగింది నీరజ.

"ఏమిటి గీస్తున్నావ్?"కాగితం మీద గీసిన ఆ బొమ్మలను చూసింది.

చిలుకలు, పిచ్చికలు, కోళ్ళు, బాతులు, నెమళ్ళు, పేరు తెలియని పిట్టలు వరసగా గీశాడు రాజేష్. వాటన్నిటిలో ఓ పోలిక గమనించింది. రెండు పెద్ద చిలుకలు, ఓ చిన్న చిలుక. రెండు పెద్ద పిచ్చికలు, ఓ చిన్న పిచ్చుక - రెండు పెద్ద కోళ్ళు, ఓ కోడిపిల్ల, రెండు పెద్ద బాతులు, ఓ బాతుపిల్ల..

నీరజకి అర్థం అయింది రాజేష్ భావం. రాజేష్ గీస్తున్న కాగితంలోని బొమ్మలని చూసింది. పక్షుల బొమ్మలు చూసినప్పుడు కూడా కలగని సానుభూతి ఆమెకి ఆ కాగితంలోని బొమ్మలు చూడగానే కలిగింది.

రెండు పెద్ద బస్సుల మధ్య ఓ చిన్న బస్సు, రెండు పెద్ద కార్ల మధ్య ఓ చిన్న కారు, వాటికి చేతులు కూడా గీశాడు. మూడు ఒకదాని చేతిలో మరొకటి పట్టుకుని వున్నాయి.

చిన్నగా నిట్టూర్చింది.

రాజేష్ కాగితంలోంచి తలెత్తి అడిగాడు.

"టైం ఎంతయింది పిన్నీ?"

"ఎనిమిదిన్నర."

"మరి మీరు సినిమాకి వెళ్ళాలికదా?"

"దేనికి వెళదాం?" అడిగింది నీరజ.

"నేను రాను. మీరు, నాన్నగారు కలసి వెళ్ళండి."

"అదేం? నువ్వూ రావచ్చుగా?"

"ఊహూఁ. అమ్మ నన్ను ఎప్పుడూ సెకండ్ షోకి వెళ్ళనివ్వదు. నిద్రలేకపోతే చిన్నపిల్లలకి ఆరోగ్యం పాడవుతుందని. మీరు వెళ్ళండి. ఆ సినిమా బావుంటే నేనూ, తాతయ్యా కలిసి మేట్నీకి వెళతాం."

"నువ్విలా విచారంగా వుంటే మాకు సినిమాకి వెళ్ళాలనిపించదు."

రాజేష్ తల అడ్డంగా వూపి చెప్పాడు గట్టిగా - "నేనేం విచారంగా లేను."

"మీరు వెళ్ళిరండీ. నేనున్నాగా" పడక్కుర్చీలో పడుకున్న దశరథరామయ్య చెప్పాడు కోడలికి.

నీరజ తమ గదిలోకి వెళ్ళింది. సాంబశివరావు తన ఆఫీస్ మేగజైన్ క్లబ్‌నుంచి తెచ్చిన ఫిల్మ్‌ఫేర్ తిరగేస్తున్నాడు.

"సినిమాకి వెళదాం" చెప్పింది నీరజ.

"వెళదామా?"

"బయలుదేరండి - టైమవుతోంది."

సాంబశివరావుకి ఎంతో రిలీఫ్‌గా వుంది యిద్దరూ కలసి సినిమా చూస్తుంటే. అడ్వర్‌టైజ్‌మెంట్ షార్ట్‌లో ఓ బేబీ ఫుడ్ కంపెనీ ప్రకటనలో చిన్న పాప పెరిగి పెద్దదవడం చూపిస్తుంటే చెప్పాడు సాంబశివరావు. "రాజేష్ నిజంగా నా కొడుకు కాదు. మా నాన్నగారిమీద ఒట్టు."

నీరజ బదులు చెప్పలేదు.

రాత్రి ఇంటికి వచ్చి బట్టలు మార్చుకున్నాక చెప్పింది నీరజ.

"ఇవాళనించి మంచంమీద పడుకుంటున్నాను."

బదులుగా నీరజని దగ్గరకి తీసుకుని, ఆమె తలని తన ఛాతీమీద అదుముకుని, ఆమె జుట్టుని కుడిచేత్తో నిమురుతూ, ఎడం చేత్తో ఆమెని బలంగా పొదివిపట్టుకున్నాడు. నీరజకి ఆ స్పర్శ తెలియచేసింది తన భర్త తనని ఎంత తీవ్రంగా ప్రేమిస్తున్నాడో. అలా దాదాపు నిముషం దాకా వుండిపోయారు.

''నీరూ! నిన్న నువ్వు 'నిప్పు, తుపాకి మందు కలిసి జీవించలేవు అన్నప్పట్నించీ నన్ను విడిచి వెళ్ళిపోతావని, విడాకులు తీసుకుంటావని ఏవేవో పిచ్చి ఆలోచనలు. నాకు ఈ క్షణం దాకా పిచ్చెక్కినట్లుగా వుందంటే నమ్ము.''

నీరజ మౌనంగా తన చేత్తో అతని వీపుని మృదువుగా సవరిస్తూ చెప్పింది.

''ప్రతీ మనిషి ప్రేమించగలడు. కానీ అంతా వివాహబంధాన్ని నిలుపుకోలేరు''

''థాంక్స్ ఫర్ యువర్ బీయింగ్.. బీయింగ్ రేషనల్.''

ఇద్దరూ మంచంమీద పడుకున్నారు.

''మీరిటు కాదు, గోడవైపు పడుకోండి'' చెప్పింది నీరజ చిన్నగా నవ్వి.

''నిన్నరాత్రి రెండుసార్లు పడ్డాను తెలుసా? పైగా మళ్ళీ పడతానేమోననే భయంతో నిద్రలోకూడా అవే కలలు'' చెప్పాడు సాంబశివరావు.

''ఈవాళ పడనివ్వనుగా'' చెప్పింది నీరజ.

''చల్లటి వాతావరణంలో, వెచ్చటి నెచ్చెలి పక్కన గోడవైపు పడుకోగలగడం అంత సుఖం ఈ లోకంలో వేరొటి వుండదు.''

''కవిత్వమా?''

''కాదు.''

''థాంక్స్''

ఎడారిలో మంచినీళ్ళు యిచ్చిన వ్యక్తికి 'థాంక్స్' కూడా చెప్పకుండా ఎలా ఆత్రంగా ఆనీళ్ళు తాగుతాడో, అలా సాంబశివరావు నీరజని అల్లుకుపోయాడు.

''రేపు ఉదయం నేను మిమ్మల్ని నిద్రలేపుతాను. మీరుకాదు'' చెప్పింది.

''నిద్రపోతాననే?''

భార్యాభర్తల మధ్య ఏర్పడే సహజమయిన ప్రేమని ఆ గదిలోని గాలికూడా గుర్తించగలిగింది.

మర్నాడు ఉదయం కొడుకు, కోడలు బయటకి వెళ్ళగానే అడిగాడు దశరథరామయ్య.

''కథ చెప్పనా?''

''కథ రాత్రికి, ఏదైనా ఆడుకుందాం తాతయ్యా'' చెప్పాడు రాజేష్.

''ఏం ఆడదాం? ఎక్కడ దాచావో కనుక్కోనా?''

రాజేష్ ఆలోచించి చెప్పాడు ''మా అమ్మ నాకు చాలా ఆటలు నేర్పింది. మేం కలిసి ఆడుకునేవాళ్ళం.''

"ఏ ఆటలు?"

"ఒక్క పదిపైసలు ఇవ్వు తాతయ్యా."

"దేనికి?"

"చెప్తానుగా, ముందు ఇవ్వు."

దశరథరామయ్య దగ్గరే పావలా తీసుకుని బయటకి పరిగెత్తి అయిదు నిమిషాల్లో వచ్చాడు.

"ఊదు తాతయ్యా"

రెండు బెలూన్స్, మిగతా పదిహేను పైసలు రాజేష్ దశరథరామయ్య చేతిలో వుంచాడు.

"బెలూన్సా? పావలావి తీసుకోవాల్సింది?"

"నాకూ అనిపించింది కాని నిన్నడిగింది పదిపైసలేగా?"

ఇద్దరూ చెరో బెలూన్ ఊది వాటికి దారం కట్టారు. రాజేష్ బాత్‌రూంలోకి వెళ్ళి, ప్లాస్టిక్ బక్కెట్‌లోని నీళ్ళని పారబోసి దాన్ని గదిలోకి తీసుకొచ్చి ఓ మూల వుంచాడు.

దశరథరామయ్యని చేతితో మరో మూలకి తీసుకెళ్ళి చెప్పాడు.

"నేను ఒన్, టూ, త్రీ చెప్పగానే బెలూన్‌ని ఆ బక్కెట్‌లో పడేలా విసరాలి. నీవు వన్, టూ, త్రీ చెపితే నేను విసురుతాను. ఎవరు గెలుస్తారో చూద్దాం. సరేనా?"

"సరే"

"ముందు నీవు ఒన్, టూ, త్రీ చెప్పు తాతయ్యా!"

"ఒన్, టూ, త్రీ"

రాజేష్ కుడికాలు ముందు, ఎడమకాలు వెనక పెట్టి గురిచూసి బెలూన్‌ని బక్కెట్ వైపు విసిరాడు. అందులో పడలేదు. బక్కెట్ అంచుకి తగిలి నేలమీద పడిపోయింది.

రాజేష్ దాన్ని అందుకుని "తాతయ్యా ఇప్పుడు నువ్వు. రెడీ ఒన్, టూ, త్రీ" చెప్పాడు.

దశరథరామయ్య విసిరిన బెలూన్ బక్కెట్ అంచుదాకా కూడా వెళ్ళలేదు. గాలిలో మరోవైపుకి వెళ్ళిపోయింది.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in